క్లుప్తంగా

29 నుంచి పట్టాభిరామ స్వామి వారి మహోత్సవాలు

కలికిరి (వాల్మీకిపురం) : వాల్మీకిపురం శ్రీ పట్టాభిరామస్వామి వారి పట్టాభిషేక మహోత్సవాలు ఈ నెల 29 నుంచి 31వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు టీటీడీ అధికారులు తెలిపారు. మూడు రోజుల పాటు టీటీడీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, 30న శ్రీ సీతారాముల కల్యాణోత్సవం, రాత్రి హనుమంత సేవ, 31న యాగశాల పూజ, మూడు రోజుల పాటు హరికథలు, భజనలు, ఆధ్యాత్మిక సంగీత కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

దైవాజ్ఞతోనే అందరికీ మంచి

కలకడ : దైవాజ్ఞతోనే ప్రతి ఒక్కరికీ మంచి జరుగుతుందని, మనం చేసే పనిలోకూడ మంచి ఉండాలని ఎంపీపీ శ్రీదేవి అన్నారు. శనివారం మండలంలోని దేవులపల్లె లో రెడ్డెప్ప ఆధ్వర్యంలో నిర్వహించిన నాగవిగ్రహాల ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తితోనే ముక్తికి మార్గమని, ప్రతి ఒక్కరు దూవచింతన కలిగి ఉండాలని అన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు అంజన్‌కుమార్, భక్తులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు దుస్తుల వితరణ

పీలేరు రూరల్ : స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు ఆర్యవైశ్య సంఘం నాయకులు మల్లికార్జున శెట్టి దంపతులు దుస్తులు వితరణ చేశారు. శనివారం స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో కన్యకాపరమేశ్వరి అమ్మవారికి కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లికార్జున శెట్టి షష్టిపూర్తి కార్యక్రమం పురస్కరించుకుని సుమారు 150 మంది పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

క్రమశిక్షణతో ఉన్నత స్థాయికి ఎదగాలి

మదనపల్లె సిటీ: విద్యార్థులు క్రమశిక్షణతో ఉన్నత స్థాయికి ఎదగాలని పోర్డు స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ జల్లా లలితమ్మ అన్నారు. శనివారం స్థానిక కోటవీధిలోని హోప్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సామాజిక విద్య, క్రమశిక్షణ గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సోషియల్ మీడియా ద్వారా మంచి ఎక్కువగా అవసరం లేని వాటి చూడటం జరుగుతుందన్నారు. ఇలాంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. సెల్‌ఫోన్లలో ఎక్కువ సమయం కేటాయిస్తున్నారని దీనికి సాధ్యమైనంతవరకు దూరంగా ఉండాలన్నారు. మోటివేటర్ రామమూర్తి మాట్లాడుతూ డ్రగ్స్ అలవాటు పడకుండా దూరంగా ఉండాలన్నారు. మంచివారితో స్నేహితం చేయాలన్నారు. మొదటి నుంచి తరగతిలో చెప్పిన పాఠాలు వింటే టెస్టులు, పరీక్షల్లో మంచి మార్కులు వస్తాయన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం రఘు, హెల్త్ స్మైల్ డెంటల్ డాక్టర్లు షాబియాషరీఫ్,నేహా, రేచన్,గౌతమి తదితరులు పాల్గొన్నారు.

రూ. 45 లక్షలతో మరుగుదొడ్ల నిర్మాణం

పీలేరు రూరల్ : స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో రూ. 45 లక్షలతో అధునాతనంగా మరుగుదొడ్ల నిర్మాణం చేపడుతున్న డీఎం బి. నిర్మల తెలిపారు. శనివారం మరుగుదొడ్ల నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ స్థానిక బస్టాండ్‌లో మరుగుదొడ్ల సమస్య తీవ్రంగా ఉందని, ప్రయాణీకుల సౌకర్యార్థం నూతనంగా మరుగుదొడ్లు నిర్మిస్తున్నట్లు తెలిపారు. స్త్రీలకు ఆరు, పురుషులకు ఆరు మరుగుదొడ్లు తోపాటు పురుషుల మూత్ర విసర్జనకు 10, ఒక స్నానపు గది నిర్మించనున్నట్లు చెప్పారు. మూడు నెలల్లో నిర్మాణ పనులు పూర్తి చేసి వాడకంలోకి తీసుకు రానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఏఈ సిద్ధనాగులు, బస్టేషన్ మేనేజర్ బాబునాయక్, లక్ష్మయ్య, ఆది పాల్గొన్నారు.

ఆర్టీసీ స్థలాలు ప్రైవేట్ వ్యక్తులకు ఇవ్వవద్దని నిరసన

పీలేరు రూరల్ : ఏపీఎస్‌ఆర్టీసీ డిపో, బస్టాండ్ ప్రాంతాల్లో ఖాళీ స్థలాలు ప్రయివేట్ వ్యక్తులకు ఇవ్వరాదని ఎన్‌ఎంయూ జిల్లా కార్యదర్శి పి.ఎస్.ఎం. రాజు అన్నారు. శనివారం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో ఎర్ర బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకొచ్చిన ప్రతిపాదనలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ స్థలాలు కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఎన్‌ఎంయూ నాయకులు సి.వి. రమణ, ఆదినారాయణ, బి.ఆర్.బి. నాయక్, హరినాథ, మహేశ్వరి, హరి, రాధిక, రేణుక పాల్గొన్నారు.

ఎంపీ మిథున్‌రెడ్డి విడుదల కావాలని ప్రార్థనలు



దువా చేస్తున్న ముస్లింలు

కలికిరి : ఎంపీ మిథున్‌రెడ్డి జైలు నుంచి విడుదల కావాలని ముస్లింలు దువా చేశారు. శనివారం ఎంపీపీ వేంపల్లె నూర్జహాన్ ఆధ్వర్యంలో మైనారిటీ పెద్దల సమక్షలంలో అల్లాకు ప్రత్యేక ప్రార్థనలను చేశారు. అక్రమ మద్యం కేసు నుంచి కడిగిన ముత్యంలా బయటపడాలని కోరారు. వైస్ ప్రెసిడెంట్ వేంపల్లె బాలాజీ, ఫయాజ్, ఖాదర్‌బాషా, సజీర్, సైదు, అమన్, వాహీద్, షౌకత్, రెడ్డిబాషా, జాకీర్, నిసార్, షబ్బీర్, అప్రుద్దీన్‌వలి, రషీద్ పాల్గొన్నారు.

సంక్షోభంలో ప్రభుత్వ వసతి గృహాలు



నేలపైనే నిద్రిస్తున్న పెద్దతిప్పసముద్రం బీసీ హాస్టల్ విద్యార్థులు



మదనపల్లె గిరిజన హాస్టల్ మరుగుదొడ్ల దుస్థితి

- అధ్వానంగా బి.కొత్తకోట గురుకులం
- రామసముద్రంలో హాస్టల్ ఆవరణలో పశువులు
- తంబళ్లపల్లెలో ఏడాదిగా బీసీ హాస్టల్ మూత
- మదనపల్లెలో మరుగుదొడ్లు కరువే

మదనపల్లె: తంబళ్లపల్లె, మదనపల్లె నియోజకవర్గాల్లోని ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లను ప్రభుత్వం గాలికి వదిలేసింది. భావి భారత పౌరులుగా ఎదగాల్సిన విద్యార్థుల విషయంలో ప్రభుత్వం చూపిస్తున్న నిర్లక్ష్యం వారి భవిష్యత్‌పై తీవ్ర ప్రభావం చూపుతోంది. మరుగుదొడ్లు, నిద్రించేందుకు బెడ్లు, సరైన తాగునీటి సౌకర్యం, నిద్రించేందుకు ఫ్యాన్లు, లైట్లు కరువే. గచ్చునేలపై, దెబ్బతిన్న భవనాల్లో విద్యార్థుల భవిష్యత్తు అధకారం అవుతోంది.

బి.కొత్తకోట మండలంలో..
బి.కొత్తకోట సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయం, హాస్టల్ భవనాలు దుస్థితిలో ఉన్నాయి. ఇక్కడ 480 మంది విద్యార్థులు ఉంటుండగా హాస్టల్, డైనింగ్ భవనాలు అత్యంత దరిద్రంగా ఉన్నాయి. హాస్టల్ గదులు పై పెచ్చులు, ఫ్లోరింగ్ పూర్తిగా దెబ్బతింది. కుక్కలు హాస్టల్ గదుల్లో సంచరిస్తూ అశుభ్రం చేస్తున్నాయి. కటిక నేలపైనే విద్యార్థులు నిద్రిస్తున్నారు. నేలపైనా గచ్చులు, గుంతలు పడ్డాయి. గదుల్లో శుభ్రతా చర్యలు చేపట్టకపోవడంతో గదులంతా చెత్తతో నిండిపోయి దుర్వాసన వస్తోంది. భోజనం చేసే డైనింగ్ దరిద్రంగా ఉంది. ఫ్లోరింగ్ దెబ్బతింది. విద్యాలయం ఆవరణలోని మురికినీటి కాలువలు దెబ్బతిని మురుగునీరు ప్రవహించడానికి వీలులేకుండా ఉంది. రాత్రిళ్లు విద్యార్థులు ఉక్కపోతతో నిద్రించాలి. కనీసం ఫ్యాన్లు, లైట్లు లేవు. దీనితో విద్యార్థులు చదువుకోవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కనీస సౌకర్యాలకు నోచుకోని విద్యార్థులు చదువులేలా సాగిస్తారో ప్రభుత్వమే చెప్పాలి. బీసీ హాస్టల్‌లో విద్యార్థులు 10 మందికి లోపే ఉంటున్నారు. ఆదర్శ విద్యాలయ హాస్టల్‌లో సిబ్బంది కొరత పీడిస్తోంది.

మదనపల్లెలో..
మదనపల్లెలో ప్రభుత్వ శాఖలకు చెందిన 12 హాస్టళ్లు నడుస్తున్నాయి. ఇందులో కళాశాల హాస్టల్, ఎస్టీ కాలనీలోని హాస్టల్ అద్దె భవనాల్లో నడుస్తుండగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సురభికాలనీలోని బీసీ బాలుర హాస్టల్ రేకుల షెడ్డులో నడుస్తోంది. కేవలం 13 మంది విద్యార్థులే ఉన్నారు. మరుగుదొడ్ల నిర్వహణలేక దుర్వాసనతో నిండిపోయాయి. విద్యార్థులు ఆరుబయలే కాలకృత్యాలు, స్నానాలు చేస్తున్నారు. గిరిజన కళాశాల హాస్టల్ గదులు జైలును తలపిస్తోంది. 70 విద్యార్థులు ఉన్నప్పటికి సరైన మరుగుదొడ్లు లేవు. నక్కలదిన్నె ఎస్సీ హాస్టల్‌లో విద్యార్థులు నేలపైనే నిద్రిస్తున్నారు. ఇంటినుంచి దుప్పట్లు తెచ్చుకొంటున్నారు.

పెద్దతిప్పసముద్రంలో..
ఇక్కడి బీసీ హాస్టల్‌లో 12 మంది విద్యార్థులుండగా నేలపైనే నిద్రిస్తున్నారు. కిటికిలకు తలుపులేక దోమలు స్వైర్యవిహారం చేస్తున్నారు విద్యారులు అనారోగ్యం పాలయ్యే ప్రమాదం నెలకొంది. లైట్లు, ఫ్యాన్లు పని చేయడం లేదు.

ములకలచెరువులో..
మండలంలో బీసీ హాస్టల్‌లో 75 మంది విద్యార్థులుండగా మరుగుదొడ్లు అధ్వానంగా ఉన్నాయి. దొమల బెడదతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. ఫ్యాన్లు, పరిశుభ్రత కనిపించడం లేదు.

రామసముద్రంలో..
మండంలోని ఎస్సీ, బీసీ, ఆదర్శ విద్యాలయం, కేజీబీవీ హాస్టళ్లు ఉండగా ఎస్సీ హాస్టల్‌లో ఉండాల్సిన 39 మంది బాలికలు లేరు. ఒకరిద్దరు మాత్రం రాత్రిలో పడుకుంటున్నారు. మిగతా వాళ్లు ఎందుకు లేరో చెప్పేవారు లేరు. ఇక్కడి ఎస్సీ బాలిక హాస్టల్ ఆవరణలో పశువులు మేత మేస్తుంటాయి. నీటి తొట్టిలు పురుగులు కనిపిస్తున్నాయి.

తంబళ్లపల్లెలో..
42 మంది విద్యార్థులున్న తంబళ్లపల్లె ఎస్టీ హాస్టల్‌లో అన్నీ సమస్యలే. మరుగుదొడ్లకు తలుపులు లేవు. తాగునీటి ఆర్‌ఓ ప్లాంటుకు మరమ్మతులు లేక పని చేయడం లేదు. దీనితో మంచినీటికి విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. హాస్టల్ భవనం పైపెచ్చులు ఊడిపోతూ ప్రమాదకరంగా మారింది. ఫ్యానులు పని చేయక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. పరుపులు, దుప్పట్లులేక నేలపైనే నిద్రిస్తున్నారు. 8 మందికి ఆరుమంది ఉపాధ్యాయులు ఉండగా, ప్రిన్సిపాల్, వార్డన్‌లు ఇన్‌చార్జ్‌లు కావడంతో వీరు మదనపల్లె నుంచి వారానికోసారి వచ్చి వెళ్తున్నారని విద్యార్థులు అంటున్నారు. దీనితో పర్యవేక్షణ గాలికి వదిలేశారు. బీసీ హాస్టల్ మూడపడింది. దీనితో 180 మంది బీసీ విద్యార్థులకు అన్యాయం జరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ఏడాది క్రితం మూతపడిన బీసీ హాస్టల్‌ను తిరిగి ప్రారంభించి బీసీ విద్యార్థులకు న్యాయం చేసే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదు.

పెద్దమండ్యంలో..
మండలం కలిచర్ల బీసీ హస్టల్ అద్దె భవనంలో నడుస్తూ విద్యార్థులను అసౌకర్యాలకు గురి చేస్తోంది. 29 మంది విద్యార్థులకు కనీస సౌకర్యాలు లేవు. నేలపై దుప్పట్లు పరచుకుని నిద్రిస్తున్నారు.

కార్యకర్తలే పార్టీకి మూలస్తంభాలు

వైఎస్సార్ సీపీ సమన్వయకర్త నిసార్ అహ్మద్



జగన్ కాలనీలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో సమన్వయకర్త నిసార్‌అహ్మద్

మదనపల్లె రూరల్ : కార్యకర్తలే వైఎస్సార్ సీపీ పార్టీకి మూలస్తంభాలని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త నిసార్ అహ్మద్ అన్నారు. శనివారం మదనపల్లె జగన్ కాలనీలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారిని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ...2019లో వైఎస్సార్ సీపీని అధికారంలోకి తెచ్చేందుకు మీరు చేసిన కృషి అభినందనీయమని, కొంతకాలంగా వివిధ కారణాలతో పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉండటంపై ప్రశ్నించారు. నాయకులు, కార్యకర్తలు స్తబ్దుగా ఉంటే పార్టీకి, ప్రజలకు నష్టమని, మళ్లీ పార్టీలో క్రియాశీలకంగా పనిచేసి వైఎస్సార్ సీపీని అధికారంలోకి తేవాలన్నారు. కష్టకాలంలో పార్టీ కోసం పనిచేసిన కార్యకర్తలకు న్యాయం జరిగేలా పార్టీ అండగా నిలబడుతుందన్నారు. కార్యకర్తలు లేకపోతే ఏ పార్టీ మనుగడలో ఉండలేదన్నారు. అటువంటి కార్యకర్తల సంక్షేమం కోసం జగనన్న ప్రత్యేక దృష్టి సారించాడన్నారు. జగన్ 2.0లో కార్యకర్తల సంక్షేమానికే తొలి ప్రాధాన్యత అని ఇప్పటికే ప్రకటించారన్నారు. ఒకసారి జగనన్న మాట ఇచ్చాడంటే..దానికి ఎంతగా కట్టుబడి ఉంటాడో ప్రజలందరికీ తెలుసన్నారు. పేద ప్రజలకు న్యాయం జరిగేలా అహర్నిశలు శ్రమించిన ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అని గుర్తుచేశారు. ఎన్నికలకు ముందు చంద్రబాబునాయుడు అబద్ధాల హామీలతో ప్రజలను మభ్యపెట్టి అధికారం చేపట్టిన తర్వాత సూపర్ సిక్స్ హామీలను అమలుచేయలేకపోతున్నాడని విమర్శించారు. ఇటువంటి దౌర్భాగ్యపు ముఖ్యమంత్రి దేశచరిత్రలో ఎవరూ లేరన్నారు. ఎన్నికలకు ముందు మహిళలకు రాష్ట్రమంతటా ఉచిత బస్సు అని చెప్పి, ఇప్పుడు కేవలం జిల్లాకు మాత్రమే పరిమితం అంటున్నాడన్నారు. అబద్ధపు హామీలు ఇవ్వకపోవడం వల్లే జగనన్న అధికారంలోకి రాలేకపోయారన్నారు. వైఎస్సార్ సీపీని భూస్థాపితం చేస్తామంటూ చంద్రబాబునాయుడు పగటికలలు కంటున్నాడని, అది వారి తరం కాదన్నారు. ఏడాది కూటమిపాలనపై ప్రజలు తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారని, అందుకే జగన్‌మోహన్‌రెడ్డి ఎక్కడ పర్యటించినా, తమ సమస్యలను చెప్పుకునేందుకు తండోపతండాలుగా ప్రజలు వస్తున్నారన్నారు. దీన్ని చూసి సహించలేని కూటమినాయకులు అక్రమ కేసులు బనాయించి పార్టీ నాయకులు, కార్యకర్తలను భయపెట్టాలని చూస్తున్నారన్నారు. టీడీపీ రెడ్‌బుక్ రాజ్యాంగానికి వైఎస్సార్ సీపీ నాయకులు భయపడే రోజులు పోయాయని, ఇప్పటికే తిరుగుబాటు మొదలైందని, వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అధికారంలోకి రావడం ఖాయమైపోయిందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఫక్రూ, షేక్ మన్సూర్, నారాయణరెడ్డి, నగేష్‌రెడ్డి, సత్తార్, జైనుసాహెబ్, సాదిక్, జబీ, సుబ్బారెడ్డి, శంకరరెడ్డి, వేణు, రెడ్డిశేఖర్, భాస్కర్, షబ్బీర్, రహమతుల్లా , డి.మహేష్, యూనస్ తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో కుటుంబాలు ఛిన్నాభిన్నం



మత్తు పదార్థాల వాడకంతో కలిగే హాని గురించి వివరిస్తున్న డీపీఈఓ మధుసూధన్

మదనపల్లె రూరల్ : మత్తు పదార్థాల వాడకం వల్ల మానసిక సమస్యలు, శారీరక వైకల్యాలు తలెత్తడమే కాకుండా కుటుంబాలు ఆర్థికంగా, భౌతికంగా ఛిన్నాభిన్నమవుతాయని జిల్లా డీపీఈఓ మధుసూధన్ తెలిపారు. శనివారం పట్టణంలోని నీరుగట్టువారిపల్లె మార్కెట్‌యార్డులో కమిటీ ఫర్ ఆల్కహాల్ అవేర్‌నెస్ అండ్ రెస్పాన్సివ్ ఎడ్యుకేషన్ (కేర్) పథకంలో భాగంగా మార్కెట్ హమాలీలకు మద్యపానంతో కలిగే దుష్పరిణామాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీపీఈఓ మధుసూధన్ మాట్లాడుతూ...కల్తీ కల్లు తయారీలో ఉపయోగించే రసాయనాలు, సారా, మద్యం సేవించడం, ఇతర హానికర మత్తు పదార్థాలు శరీరానికి ఎంతో హాని కలిగిస్తాయన్నారు. కాలేయం, మూత్రపిండాలు వంటి అవయవాల పనితీరును దెబ్బతీస్తాయని వివరించారు. గుట్కా, జర్దా తదితర పొగాకు ఉత్పత్తుల్లో ఉండే నికోటిన్ ప్రజలను మత్తుకు వ్యసనపరుస్తుందని, నోటి, గొంతు క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులకు దారితీస్తుందని హెచ్చరించారు. ప్రజలు తమ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకూడదని, ఆరోగ్యాన్ని సక్రమంగా కాపాడుకోవాలంటే దురలవాట్లకు దూరంగా ఉండాలని, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు. సమావేశం అనంతరం మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలోని డీ-అడిక్షన్ సెంటర్‌ను సందర్శించి, అందులో చికిత్స పొందుతున్న వారిని పరామర్శించి, సైక్రియాటిస్ట్ డాక్టర్.రాధికతో కలిసి కౌన్సిలింగ్ ఇచ్చారు. రక్తనిధి కేంద్రంలో ఎక్సైజ్ సిబ్బంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో రాయచోటి అసిస్టెంట్ ప్రొహిబిషన్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ వై.జోగేంద్ర, ఎంఈఓ ప్రభాకరరెడ్డి, అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ గంగిరెడ్డి, మార్కెట్‌యార్డు సెక్రటరీ జగదీష్, లేబర్ యూనియన్ ప్రెసిడెంట్ ఎస్.ఎ.మస్తాన్, ఎక్సైజ్ సీఐ భీమలింగ, ఎస్ఐ పి.జబీవుల్లా, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రాణం కంటే విలువైనది లేదు

- సురక్షిత ప్రయాణం సాగించండి
- మదనపల్లె డీఎస్పీ మహేంద్ర



అంగళ్లు హైవేపై వాహనదారులకు డీఎస్పీ అవగాహన

కురబలకోట: జీవితంలో సమస్యలు వచ్చిపోతుంటాయని ప్రాణం కంటే విలువైనది లేదని మదనపల్లె డీఎస్పీ ఎస్. మహేంద్ర అన్నారు. శనివారం ఆయన మండలంలోని దొమ్మన్నబావి, విశ్వం కళాశాల ప్రాంతాల్లో స్వయంగా ట్రాఫిక్‌ను పర్యవేక్షించారు. ట్రాఫిక్ రూల్స్, రోడ్డు ప్రమాదాల నియంత్రణ, రోడ్డు భద్రత, త్రిపుల్ రైడింగ్‌పై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ వాహన రికార్డులు తప్పనిసరిగా కలిగి ఉండాలన్నారు. కుటుంబం ఆధారపడి ఉంటుందన్నారు. మోటార్ సైక్లిస్టులు హెల్మెట్, కార్లు నడిపేవారు సీటు బెల్ట్ ధరించాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదన్నారు. ఓవర్ స్పీడ్, రాంగ్ సైడ్ డ్రైవింగ్ చేయరాదన్నారు. బాధ్యతా రహితంగా వాహనాలు నడిపి ప్రాణాల మీదకి తెచ్చుకోవద్దన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించి సురక్షిత ప్రయాణం చేయాలన్నారు. ముఖ్యంగా రోడ్లపై ప్రమాదం జరిగినప్పుడు సకాలంలో అంబెలెన్సుకు సమాచారం ఇవ్వడం బాధ్యతగా భావించాలన్నారు. ట్రాఫిక్ రూల్స్ ఉల్లంఘిస్తే జరిమానాలు తప్పవని హెచ్చరించారు. శారీరక, మానసిక ఆరోగ్యాన్ని కూడా కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ముదివేడు ఎస్ఐ దిలీప్‌కుమార్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయండి



సమస్యలపై అధికారులతో మాట్లాడుతున్న ప్రజాప్రతినిధులు

ములకలచెరువు: సమస్యల పరిష్కారానికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో కృషి చేయాలని ఎంపీపీ సాయిలీలా అన్నారు. శనివారం స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఆధ్వర్యంలో మండల మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలు ప్రతిపాదనలను తీర్మాణం చేశారు. తాగునీటి సమస్య లేకుండా నిధులు మంజూరుకు ప్రతిపాదనలు పంపినట్లు ఆర్‌డబ్ల్యూఈఎస్ అధికారులు తెలిపారు. ఉపాధిహామీ పనులు తమకు సమాచారం ఇవ్వకుండా పనులు చేసుకుంటున్నట్లు వైఎస్సార్‌సీపీ సర్పంచులు ఉపాధి సిబ్బందిపై అధికారులకు ఫిర్యాదు చేశారు. గ్రామాల్లో జరిగే అభివృద్ధి పనులను ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి పనులు చేయించాలని ఎంపీడీఓ హరినారాయణ సూచించారు. కార్యక్రమంలో సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలి



పోస్టర్స్ ఆవిష్కరిస్తున్న నాయకులు

మదనపల్లె రూరల్ : రాష్ట్రంలో ఏళ్ల తరబడి పనిచేస్తున్న విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్(సీఐటీయూ) జిల్లా అధ్యక్షులు నారాయణ యాదవ్ డిమాండ్ చేశారు. 2022 పీఆర్సీ అరియర్స్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 7న తలపెట్టిన ఛలో విద్యుత్ సౌధ విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. మదనపల్లె సబ్ స్టేషన్ ఆవరణలో వాల్‌పోస్టర్స్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నారాయణయాదవ్ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన విధంగా ఏపీ ప్రభుత్వం కార్మికులకు రూ.కోటి ఇన్సూరెన్స్ ఇవ్వాలన్నారు. కొత్త ఆపరేటర్లందరికీ, పాత ఆపరేటర్లతో సమానంగా జీతాలు ఇవ్వాలని, ఫీల్డ్ అసిస్టెంట్లకు స్కిల్ వేతనం ఇవ్వాలన్నారు. ప్రతి సబ్ స్టేషన్‌లో నైట్ వాచ్‌మెన్‌ను ఏర్పాటుచేయాలని, కార్మికులు అనారోగ్యానికి, ప్రమాదానికి గురైతే ఉచితంగా అన్‌లిమిటెడ్ హెల్త్‌కార్డులను మంజూరు చేయాలన్నారు. సమావేశంలో యూనియన్ నాయకులు రాజశేఖర్, ఎస్‌కే.ఖదీర్‌అహ్మద్, కరీముల్లా, రవి, సుధా, రమేష్, విజయేంద్ర, చంద్ర, రమేష్ పాల్గొన్నారు.

రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి

మదనపల్లె రూరల్ : రౌడీ షీటర్లు సత్ప్రవర్తనతో మెలగకుండా ఉంటే చర్యలు తప్పవని డీఎస్పీ మహేంద్ర హెచ్చరించారు. శనివారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ మహేంద్ర, పట్టణంలోని రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. రౌడీషీటర్లు అల్లర్లు, అలజడులకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. చెడు నడత కలిగిన రౌడీ షీటర్లపై పోలీసు నిఘా ఉంటుందన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదన్నారు. రౌడీ షీటర్లుగా నమోదైన ప్రతి ఒక్కరూ సంబంధిత పోలీస్‌స్టేషన్లలో సంతకాలు చేస్తూ ఉండాలన్నారు. బయట ప్రాంతాలకు వెళ్లే సమయంలో స్టేషన్ అధికారి అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. రౌడీషీటర్ల కదలికలపై ఏదైనా అనుమానం వస్తే వెంటనే అదుపులోకి తీసుకుని బైండోవర్ చేస్తామన్నారు. కార్యక్రమంలో వన్‌టౌన్ సీఐ ఎరీషావలీ, ఎస్ఐలు చంద్రమోహన్, శివకుమార్, అన్సర్‌బాషా, రహీముల్లా పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

పీలేరు : సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ లోకేష్ అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శక్తి యాప్ టీమ్ ఆధ్వర్యంలో సైబర్ నేరలు, శక్తియాప్ పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆకర్షణీయమైన బహుమతులు, లోన్లు అంటూ వచ్చే మెసేజ్‌లపై అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఓటీపీలు, పాస్‌వర్డ్‌లు ఎవ్వరికీ చెప్పరాదని తెలిపారు. ఎక్కడైనా సైబర్ నేరాలు జరిగితే వెంటనే 1930 నెంబర్‌కు కాల్ చేయాలన్నారు. కార్యక్రమంలో శక్తి టీమ్ సభ్యులు దశరథ, సుధాకర్, శోభారాణి, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శ్రీదేవి పాల్గొన్నారు.

మాజీ మంత్రి పెద్దిరెడ్డిని కలిసిన జెడ్పీటీసీ

రామసముద్రం : తిరుపతిలోని తన స్వగృహంలో మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు, రామసముద్రం జడ్పీటీసీ సిహెచ్ రామచంద్రారెడ్డి, ఆయన భార్య ఉమా రామచంద్రరెడ్డి శనివారం కలిశారు. ఈ సందర్భంగా ప్రస్తుతం రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అవలంభిస్తున్న అరాచక పాలన, ఎంపి పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి అక్రమ అరెస్ట్ గురించి చర్చించారు. కూటమి ప్రభుత్వం ఎన్ని అక్రమ కేసులు పెట్టిన బెదిరేది లేదన్నారు. పార్టీ బలోపేతానికి కృషి చేసి ముందుకు సాగుతామని జెట్పీటీసీ తెలిపారు.


ఘనంగా కార్గిల్ విజయ్ దివస్ వేడుకలు



అమరవీరులకు నివాళి అర్పిస్తున్న బీజేపీ నాయకులు

మదనపల్లె రూరల్ : కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా అమరవీరులకు బీజేపీ యువమోర్చా ఆధ్వర్యంలో నాయకులు ఘనంగా నివాళులర్పించారు. స్థానిక మల్లికార్జున శ్రీ కృష్ణదేవరాయ సర్కిల్‌లో భారతదేశ జెండాలు చేతపట్టుకుని భారత్ మాతాకీ జై, అమరవీరులకు సెల్యూట్ అంటూ నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...భారత భూభాగాన్ని ఆక్రమించుకోవాలని కుట్రపన్నిన పాకిస్తాన్‌కు మనదేశ ఆర్మీ ఆపరేషన్ విజయ్ పేరుతో కార్గిల్ యుద్ధభేరి మోగించి శత్రుసేనలను తరిమి కొట్టిందన్నారు. ఇది జరిగి నేటికి సరిగ్గా 26 ఏళ్లు పూర్తయిందని, ప్రతి ఏటా జూలై 26 కార్గిల్ విజయ్‌దివస్ సందర్భంగా అమరవీరులకు ఘనంగా నివాళులర్పిస్తున్నామన్నారు. మన దేశాన్ని రక్షించడం కోసం అత్యంత కఠినమైన భూభాగాల్లో అసాధారణ ధైర్యం, ధృడ సంకల్పంతో పోరాడి ప్రాణత్యాగం చేసిన వీరజవాన్లకు నివాళి అర్పించారు. కార్గిల్ యుద్ధంలో వారి త్యాగం ..మన సాయుధ దళాల సంకల్పానికి నిదర్శనమని, వారికి ఈ దేశం ఎప్పటికీ రుణపడి ఉంటుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి యల్లంపల్లె ప్రశాంత్, పులినరేంద్రకుమార్‌రెడ్డి, బండిఆనంద్, డాక్టర్.అజ్మతుల్లాఖాన్, నారదరెడ్డి, జబ్బలశ్రీనివాసులు, వినోద్‌యాదవ్, పిల్లస్వామి నాయక్, మఠం కిరణ్‌కుమార్, నాగరాజు, బరిణేపల్లి రవికుమార్, పూలనాగరాజు, బాలకృష్ణ, శ్రీకాంత్, అఖిల్, కోసూరి భవానీ తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ యుగంలో పోటీతత్వాన్ని కొనసాగించాలి



మాట్లాడుతున్న రిసోర్సుపర్సన్ సందీప్‌కుమార్‌రెడ్డి

మదనపల్లె సిటీ: డిజిటల్ యుగంలో పోటీతత్వాన్ని కొనసాగించడానికి కొత్త సాంకేతికతలను స్వీకరించాలని రిసోర్సుపర్సన్ సందీప్‌కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం స్థానిక చిత్తూరురోడ్డులోని ఆదిత్య ఇంజినీరింగ్ కాలేజీలో జనరేటివ్ ఏఐ, ట్రాన్స్‌ఫార్మింగ్ ది ఫ్యూచర్ ఆఫ్ క్రియేషన్ అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. జనరేటివ్ ఏఐ భావనలు, అనువర్తానాలు, భవిష్యత్తు ధోరణులపై వివరించారు. జనరేటివ్ ఏఐ పరిశ్రమలను ఎలా రూపొందించడం, ఆవిష్కరణలను ఎలా ప్రభావితం చేస్తోందో తెలియజేశారు. కంటెంట్ సృష్టి, డిజైన్, ఆరోగ్య సంరక్షణ, ఆటోమేషన్ వంటి రంగాలలో దాని ప్రవర్తన ప్రభావాన్ని వివరించారు. కార్యక్రమంలో కాలేజీ డైరెక్టర్ డాక్టర్ రామలింగారెడ్డి, కరస్పాండెంట్ నాగమల్లారెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాయుడు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

గౌతిమ్మరాయస్వామికి ప్రత్యేక పూజలు

రామసముద్రం : మండలంలోని దిన్నిపల్లి సమీపంలోని అడ్డకొండలో వెలసిన శ్రీ గౌతిమ్మ రాయ స్వామి ఆలయంలో శ్రావణమాసం మొదటి శనివారం సందర్భంగా ఘనంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామివారికి అభిషేకాలు, అర్చనలు చేసి విశేష అలంకరణ చేశారు. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి ఉపవాస దీక్షలతో భక్తిశ్రద్ధలతో స్వామివారికి పూజలు చేసి మొక్కులు చెల్లించారు. పలువురు తలనీలాలు సమర్పించారు.

మందు బాబులకు అడ్డాగా ప్రభుత్వ జిల్లా ఆసుపత్రి



శుక్రవారం రాత్రి ఆసుపత్రి వద్ద మద్యం మత్తులో గొడవకు దిగిన వ్యక్తులను బయటకు పంపుతున్న పోలీసులు

మదనపల్లె రూరల్ : మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆసుపత్రి మందుబాబులకు అడ్డాగా మారింది. రాత్రి అయితే చాలు... ఆస్పత్రి ఆవరణలో అంబులెన్స్ డ్రైవర్లు, యజమానులు, తమ స్నేహితులతో కలిసి మద్యం సేవిస్తూ మత్తులో తూలుతున్నారు. మద్యం మోతాదు మితిమీరితే, మత్తులో ఒకరినొకరు దూషించుకుంటూ కొట్టుకుంటూ దౌర్జన్యాలకు దిగుతున్నారు. ఆస్పత్రి సెక్యూరిటీ సిబ్బంది పోలీస్ ఔట్ పోస్ట్ సిబ్బంది ఇలాంటి ఘటనలను నివారించడంలో పూర్తిగా చేతులెత్తేసి ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి ప్రైవేట్ అంబులెన్స్ యజమాని ఆసుపత్రి ఆవరణలోని నూతన డ్రగ్ ఇన్స్‌పెక్టర్ కార్యాలయం సమీపంలో, తన స్నేహితులతో కలిసి మద్యం సేవించాడు. అదే సమయంలో ఆస్పత్రి ఆవరణలో ఉన్న అంబులెన్స్ డ్రైవర్ రవి, ప్రశాంత్ నగర్ కు చెందిన రెడ్డితో మద్యం మత్తులో గొడవకు దిగి దౌర్జన్యం చేశాడు. వారిపై దాడి చేసి కొట్టాడు. ఆస్పత్రి అత్యవసర విభాగం ఎదుట చోటు చేసుకున్న ఈ ఘటన సెక్యూరిటీ సిబ్బంది ఎదురుగా జరుగుతున్నా ఆపలేకపోయారు. పోలీస్ అవుట్ పోస్టులో విధులు నిర్వహిస్తున్న రఘు జోక్యం చేసుకున్నా నివారించలేకపోయారు. స్థానిక ఎమ్మెల్యే, ఆస్పత్రి యాజమాన్యం, పోలీసులు, మీడియాను అసభ్యకర పదజాలంతో దూషిస్తూ వీరంగం సృష్టించాడు. అవుట్ పోస్ట్ పోలీసులు టూ టౌన్ పోలీస్ స్టేషన్ కు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు గొడవ సద్దుమణిగేలా చర్యలు చేపట్టారు. మద్యం మత్తులో దాడి చేసి దౌర్జన్యానికి పాల్పడిన ఘటనను పోలీసులు, మీడియా వ్యక్తులు వీడియోలు చిత్రీకరించారు. మరోవైపు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి నిర్వహణను పర్యవేక్షించాల్సిన సూపరిండెంట్, ఆర్‌ఎంఓ, వైద్య సిబ్బంది పర్యవేక్షణ పూర్తిగా కొరవడంతో, ఆసుపత్రిలో రక్షణ లేకుండా పోయింది. ఆసుపత్రిలో తగిన భద్రతా చర్యలు చేపట్టడంలో యాజమాన్యం పూర్తిగా విఫలమైంది ఆస్పత్రిలో అసాంఘిక కార్యక్రమాలకు తావిచ్చారన్న ఆరోపణలు ఉన్నాయి. ఆస్పత్రి ఆవరణలో సీసీ కెమెరాల నిఘా కొరవడం, ఆస్పత్రి పై అంతస్తు భవనాలపై పర్యవేక్షణ లేకపోవడం, సెక్యూరిటీ సిబ్బంది విధులలో పూర్తి నిర్లక్ష్యం చూపడంతో ఆస్పత్రిలో అసాంఘిక కార్యక్రమాలకు ఆస్కారం ఏర్పడుతోంది. డీఎస్పీ, హాస్పిటల్ సూపరిండెంట్, ఆస్పత్రి భద్రతా చర్యలపై చొరవ చూపి, ఆసుపత్రిలో నెలకొంటున్న గొడవలు దాడులను అరికట్టాలి. మహిళలు, ఆస్పత్రి మహిళా సిబ్బందికి భద్రత కల్పించాల్సిన అవసరం ఉంది.